
# పోతనభాగవతంలో రసగుళికలు

- ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమును బొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండితానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన

రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కథలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్థాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

---

# 3 వ భాగం

## హిరణ్యాక్షుడు - 2

హిరణ్యాక్షుణ్ణి నారదుడూ, వరుణుడూ రెచ్చగొట్టి శ్రీహరి మీదకి తోలేరు కదా? వాడు రసాతలంలోకి లోకి వెళ్ళేసరికి యజ్ఞ వరాహం కదం తొక్కుతోంది. ముల్లోకాలూ నేను జయించేను; నన్ను అడక్కుండా, ఇలా ఈ వరాహం ఇక్కడకి ఎందుకొచ్చింది? అనుకుని దానితో ఇలా అన్నాడు.

**క. ఘనసూకర మూఢాత్మక**
**వనరుహసంభూతదత్తవరదానమునం**
**గనిన రసాతలగతభువి**
**యనయంబును నా యధీనమై వర్తించున్** [3-641]

ఓ బుద్ధి లేని వరాహమా, బ్రహ్మ ఇచ్చిన వరాల వల్ల ఈ రసాతలం, ఈ భూమి నా అధీనంలో ఉన్నాయి. నువ్వెందుకు ఇక్కడికొచ్చావ్? భూమిని ఇక్కడ వదిలి వెళ్ళకపోతే నీ ప్రాణాలు తీస్తాను అని ఇంకా వాగడం మొదలెట్టాడు. అయితే వరాహం ఇవేమీ పట్టించుకోకుండా భూమిని నిలబెట్టడంలో నిమగ్నమై ఉంది.

**క. నిందకు రోయక లజ్జం**
**జెందక వంచనను రణముసేసి జయంబుం**
**బొందెదనని తలఁచుచునిటు**
**పందగతింబాఱు బంటుపంతమె నీకున్** [3-648]

అప్పుడు ఇంకా ఇలా అన్నాడు హిరణ్యాక్షుడు. "నీకు సిగ్గులేదా? నేను తిడుతున్నా నాతో యుద్ధం చేసి గెలుస్తాను అనుకుంటున్నావేమో? ఇదేనా నీ పరాక్రమం?"

మళ్ళీ ఒక డైవర్షన్. ఒక రాక్షసుడు వరాహంతో ఎలా మాట్లాడగలిగేడు అనేవాళ్ళకి - ఒక లెవెల్ కి వెళ్ళాక భాష అనేది అనవసరం. రమణ మహర్షి కోతులు, పక్షులతోనూ, పాములు, పశువులతోనూ ఏ కష్టంలేకుండా రోజూ మాట్లాడ గలిగేవారు. ఇద్దరు స్వామిజీలు కలుసుకుంటే ఒకాయన అడిగాడుట తర్వాత "ఏమండీ మీరిద్దరూ తలుపులేసుకుని ఏమి మాట్లాడుకున్నారు? అని?" "we spoke in silence," అని వచ్చిందిట సమాధానం. అవతల స్వామిజీ సన్నిధిలో నేనెంత పవిత్రత సంపాదించుకోగలనూ అని అనుకుంటారు ఇద్దరూ!

సరే భూమిని మళ్ళీ దారిలోకి తీసుకొచ్చి దానిమీద తన కరుణ ప్రసరించేలా చేశాడు విష్ణువు. కరుణ ఎందుకంటే ఆయన లోకరక్షైకారంభకుడని ముందే చెప్పుకున్నాం కదా? అవతారంలో ఒక పనైపోయింది. రెండోది మిగిలి ఉంది. ఇప్పుడు వరాహం హిరణ్యాక్షుడి కేసి తిరిగి ఇలా అంది.

**మ. వినరా యోరి యమంగళాచరణ యుద్వృత్తిన్ ననున్ నీ మది**
**న్ననయంబున్ వనగోచరంబగు మృగంబంచుందలంతౌర నే**
**నెనయన్ వన్యమృగంబయౌదు బలియై యేతెంచు నీబోఁటి యీ**
**శునకశ్రేణివధింతు నేఁడని మొనన్ సోఁకోర్చి వర్తించినన్** [3-655]

ఓరీ అమంగళాలు ఆచరించేవాడా, నేను వనచరాన్ని అన్నావు కదా? అవును నేను వనచరాన్నే అయితే నీలాంటి కుక్కల్ని మట్టుపెట్టే వనచరాన్ని. ఉత్తినే వదరడం ఎందుకు ఇప్పుడే నిన్ను చంపుతాను.

మ. అని యిబ్భంగి సరోరుహాక్షుండు హిరణ్యాక్షున్ విడంబించి ప
ల్కిన హాసోక్తులకుల్కి రోషమదసంక్షోభితచేతస్కుఁడై
కనుఁగ్రేవన్ మిడుఁగుర్లు సాలఁబొడమంగాఁగిన్కమైఁదోఁకఁద్రొ
క్కిన కృష్ణోరగరాజుమాడ్కిమదిలోఁగీడ్పాటు వాటిల్లఁగన్ [3-662]

అసలే ఇక్కడకి వచ్చేసరికి వరుణుడు, నారదుడు హిరణ్యాక్షుడికి బాగా పురి పెట్టి వదిలేరు. ఇప్పుడు తన అధీనంలో ఉన్న భూమిని ఈ యజ్ఞ వరాహం తీసుకెళ్ళిపోయింది. ఇలా నాలుగు తిట్లు తిరిగి అంటించేసరికి వీడికి కోపంవచ్చి తోకమీదలేచిన నల్లతాచులా(దోఁకఁద్రొక్కిన కృష్ణోరగరాజుమాడ్కి) లేచాడు. వాడు సామాన్యుడా? లోకాలన్నింటినీ గడగడలాడించాడు. వెంఠనే యుద్ధాని సన్నద్ధమై పోరు సాగించాడు.

క. పరువడి దితిసుతుఁడతిభీ
కరగదఁజేబూని చిత్రగతులనుబద్మో
దరుఁడాసి చేతిగద సా
గరమునఁబడ నడిచె బాహుగర్వమెలర్పన్ [3-674]

వివిధ మాయల్తో దగ్గిరకొచ్చి విష్ణువు చేతిలో గదని అంత దూరంలో పడేటట్టూ కొట్టేడు. చేతిలో ఉన్న కౌమోదకీ గద దూరంగా పడింది. హరి నిరాయుధుడై పోయాడు.

తే. హరి నిరాయుధుఁడైన సురారి సమర
ధర్మమాత్మనుదలఁచి యుద్ధంబుఁదక్కి
నిలిచి చూచుచునుండెను నింగినమర
వరులహాహారవంబులభరితమయ్యె [3-676]

అప్పుడు హిరణ్యాక్షుడు రణ ధర్మం పాటించి విలాసంగా విష్ణువుకేసి "ఇప్పుడేమంటావ్?" అన్నట్టు చూస్తూ నించున్నాడు. దానికి దేవతలందరూ హాహారావాలు చేస్తూ ఆశ్చర్యపోయేరు. కొంచెం భయం కలిగింది కూడా ఎందుకంటే ఇప్పుడు హిరణ్యాక్షుడు చావడేమో అని.

**క. సరసిజనేత్రుఁడుదనుజే**
**శ్వరు సంగరధర్మమునకు సమధికశౌర్య**
**స్ఫురణకుఁదనచిత్తంబున**
**గరమాశ్చర్యంబునొంది కడఁకదలిర్పన్** [3-677]

మహావిష్ణువుకూడా ఆశ్చర్యపోయేడు, వీడి రణ ధర్మానికి. ఎంత చెడ్డవాడైనా యుద్ధ ధర్మం పాటించవల్సిందే. శతృవు నిర్వీర్యుడైపోయేడు కదా ఇంక వాడ్ని నాశనం చేసేద్దాం అని ఆటం బాంబులు వేయడం రణ ధర్మం అనిపించుకోదు. అందుకే హరి ఆశ్చర్యపోయేడు. ఓ రకంగా చెప్పాలంటే హిరణ్యాక్షుడు అరివీరభయంకరమైన శూరుడైనా నిరాయుధుడైన శ్రీహరిని వేళాకోళం చేయడం గానీ, చిన్నబుచ్చడం కానీ చేయలేదు. అలా చూస్తూ నించున్నాడు అంతే.

**మ. కుతలోద్ధర్త మనంబునందలంచె రక్షోరాడ్వధార్థంబుగా**
**దితిసంతానకులాటవీమహితసందీప్తప్రభాశుక్రమున్**
**సతతోద్యజ్జయశబ్దసన్ముఖరభాస్వచ్చక్రమున్ సంతతా**
**శ్రితనిర్వక్రముఁబాలితప్రకటధాత్రీచక్రముంజక్రమున్** [3-678]

అప్పుడు యజ్ఞవరాహరూపుడైన విష్ణువు తనని ఆశ్రయించేవారికి అనుకూలమైనటువంటిదీ, ఎప్పుడూ జయ శబ్దం చేసేదీ, వాడిపళ్లు కలదీ ఐన తన సుదర్శన చక్రాన్ని తల్చుకున్నాడు. అది వచ్చి విష్ణువు చేతినలంకరించింది. తిరిగి యుద్ధం ప్రారంభమైంది.

**మ. హరిమీఁదన్ దితిసంభవుండు ఘనమాయాకోట్లు పుట్టించినన్**
**ధరణీచక్రము భూరిపాంసుపటలధ్వాంతంబునంగప్పె భీ**
**కరపాషాణపురీషమూత్రఘనదుర్గంధాస్థిరక్తావళుల్**
**గురిసెన్ మేఘములభ్రవీథిని మహాక్షోభక్రియాలోలమై** [3-689]

అయితే దితిపుత్రుడు ఇప్పుడు అనేక కోట్ల మాయలు చేసి రక్త ధారలూ, మాంస ఖండాలు, అనేక దుర్గంధాల్తో కూడిన మలమూత్రాదులు కురిపించేడు. వీటన్నింటితోనూ ధరణీ చక్రం అంతా కమ్ముకుపోయింది. అప్పుడు విష్ణువొదిలిన చక్రం వాటిన్నింటినీ పటాపంచలు చేసింది. అవన్నీ సాధుపుంగవులమీద ప్రయోగింపబడిన పనికిరాని చేతబడుల్లా తయారయ్యాయి.

ఈసరికి దేవతలు, బ్రహ్మ యుద్ధం చూస్తూ కంగారులో ఉన్నారు వీడెప్పుడు పోతాడా అని. అప్పుడు విష్ణువుని ఉద్దేశించి బ్రహ్మ అన్నాడు "వీడిని అభిజిత్ ముహుర్తం అయిన ఇప్పుడే మధ్యాహ్నం చంపాలి. సాయంకాలం అయితే వీడి బలం పెరుగుతుంది" అని.

అవకాశం చూసి వాడిచేతిలో ఆయుధాలు ఎగరగొట్టేక,

**మ. దివినింద్రాదులు సంతసింప హరి మొత్తెంగర్ణమూలంబునం**
**బవిసంకాశకఠోరహస్తమున శుంభల్లీలమై దాన దా**
**నవలోకేశుఁడు రక్తనేత్రుఁడగుచున్దైన్యంబు వాటిల్లగా**
**భువిమీఁదంబడి సోలె మారుతహతోన్మూలావనీజాకృతిన్** [3-700]

ఇంక యుద్ధం చాలించే నెపంతో హరి తన కఠోరమైన హస్తంతో రాక్షసుడి గూబమీద ఒక మొత్తు మొత్తేడు. దాని దెబ్బకి వాడు నెత్తురు కక్కుకుంటూ గాలివానకి కూకటివేళ్లతో కూలబడిన చెట్టులా (మారుతహతోన్మూలావనీజాకృతిన్) నేలమీద పడ్డాడు. వరుణుడు చెప్పినట్టే జరిగింది. అప్పుడు దేవతలందరూ ఇలా అనుకున్నారుట.

**మ. వరయోగీంద్రులు యోగమార్గములనెవ్వానిన్ మనోవీథి సు**
**స్థిరతన్ లింగశరీరభంగమునకై చింతింతురా పంకజో**
**దరు పాణ్యహతిఁదన్ముఖాంబురుహమున్ దర్శించుచుంజచ్చె దు**
**ర్ధరితోత్తంసుఁని దైత్యవల్లభుని సౌభాగ్యంబుదానెట్టిదో** [3-703]

జీవితాంతం భక్తి ప్రపత్తుల్తో వరయోగీంద్రులు విష్ణువుని సేవించి, శరీరంవిడిచే సమయంలో విష్ణువు గురించి చింతిస్తారో అలాగే ఈ దైత్యుడు విష్ణువు చేత చంపబడి ఆయనకేసి చూస్తూ ప్రాణాలు విడిచేడు. వీడు ఎంత అదృష్టవంతుడో. ఇక్కడకూడా దేవతలు తమ శత్రువును కించపరిచే విధంగా మాట్లాడలేదు చూసారా? దైత్యవల్లభుని సౌభాగ్యంబుదానెట్టిదో అంటున్నారు.

**చ. సమమతి వీరు దైత్యకులశాసనుపారిషదుల్ మునీంద్ర శా**
**పమున నికృష్టజన్మమునఁబైకొని పుట్టియు నేఁడు విష్ణుచే**
**సమయుటఁజేసి మీఁదనగు జన్మమునన్ జలజాతాక్షు నిత్య వా**
**సమున వసింతురెన్నటికిఁజావుబుట్టువులేవు వీరికిన్** [3-704]

శాపవశాన నికృష్టమైన జన్మ ఎత్తవల్సి వచ్చింది. అయితే వీళ్ళు విష్ణువుచేత చంపబడి వైకుంఠం చేరుతారు; కనక వీళ్ళకు ఇంక చావు పుట్టుకలు లేవు.

అయితే హరి హిరణ్యాక్షుడ్ని చంపడానికి చేత్తో ఎందుకు కొట్టేడు?

"సతతోద్యజ్జయశబ్దసన్ముఖరభాస్వచ్ఛక్రమున్ సంతతాశ్రితనిర్వక్రముఁబాలితప్రకటధాత్రీచక్రముంజక్రము" వదిల్తే అది వాణ్ణి క్షణంలో చంపేసి ఉండును కదా? అలా చేయలేదు. చేత్తోనే కొట్టేడు ఎందుకంటే శతృవు (వాడికా స్పృహ లేకపోయినా) తన సొంత విశ్వాసమైన ద్వారపాలకుడు. వాడిలో ఉన్న రాక్షసత్వం పోవాలంటే తన చేతి స్పర్శ అత్యంతావుసరం. ఒకసారి పరుసవేది ఇనుముకి తగలగానే బంగారంగా మారినట్టు హిరణ్యాక్షుడి రాక్షస గుణాలు బాగా తగ్గిపోయి మరో జన్మ ఎత్తాలి. ఈ మూడు జన్మల్లో పూర్తిగా రాక్షసత్వం పోయి మరో జన్మ ఉండకూడదనే విష్ణువు అలా కొట్టేడు వాడిని.

తర్వాతి అవతారంలో కూడా హిరణ్యకశిపుడ్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుని మరీ సంహరించాడు శ్రీహరి. ఎందుకంటే వీళ్ళద్దరూ అయనకి అత్యంత ఆప్తులు కాబట్టి. అందుకే పోతన "అద్భుత చరితున్, రవితేజున్" అన్నాడు పుట్టిన హిరణ్యాక్ష, హిరణ్యకశిపులనిద్దర్నీ.

ఇదే విధంగా బలి చక్రవర్తిని తన సొంత కాలితో సుతలానికి పంపించేడు ఎందుకంటే, నూరు అశ్వమేధాలు చేసాక మిగిలిన కొద్ది రాక్షసత్వం పోయి ఇంద్రపదవికి తయారుగా ఉండడానికి. ఆయన స్పర్శ అటువంటిది. పరమయోగులకు పరి పరి విధముల వరమొసగెడి నీ పాదము అని అన్నమయ్య ఊరికినే అన్నాడా?

ఇన్ని కష్టాల కోర్చి భక్తులని ఉద్ధరించడానికి - అతని ఉనికితో పోలిస్తే అతి ఏహ్యమైన మానవ జన్మ ఎత్తి -చేసిన పనులకి భగవంతుడు భక్తపాలన కళా సంరంభకుడు అనడంలో ఇంకా సందేహం ఉందా?

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS